క్లుప్తంగా

కారు బోల్తా

సంగం: పెరమన వద్ద బుధవారం ముంబయి రహదారిపై వెళ్తున్న కారుఅదుపుతప్పి పంట కాలువలో బోల్తాపడింది. బుచ్చిరెడ్డిపాళెం నుంచి ఆత్మకూరుకు బయలుదేరిన కారు ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించే క్రమంలో డ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో అదుపుతప్పి పంట కాలువలో బోల్తా పడింది. డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

కొరిమెర్ల సమీపంలోని మలుపు వద్ద బుధవారం 108 వాహనం అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. వివరాలు..కలిగిరి నుంచి నెల్లూరుకు రోగిని తీసుకెళ్తున్న అంబులెన్స్ మలుపు వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రోగితో పాటు 108 సిబ్బందికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. వెంటనే జేసీబీ సాయంతో వాహనాన్ని బయటకు తీశారు.

ఎంపీపీకి సన్మానం



చేజర్ల: మండల పరిషత్ నూతన అధ్యక్షుడు తూమాటి విజయభాస్కర్‌రెడ్డిని సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చేజర్ల సచివాలయంలో బుధవారం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈఓపీఆర్డీ రామయ్య, బోడిపాడు ఉప సర్పంచ్ రత్నారెడ్డి, వంగవరపు ఆనంద్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తురిమెర్లవాసికి డాక్టరేట్



కావలి: దగదర్తి మండలం తురిమెర్ల గ్రామానికి చెందిన అల్లం మల్లికార్జునకు డాక్టరేట్ లభించింది. భౌతిక శాస్త్రంలో 'స్ట్రక్చర్ మార్ఫాలజీ అండ్ నెగిటివ్ డైఎలక్ట్రిక్ బిహేవియర్ నానోకాంపొసిట్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాపత్రానికి గానూ విశాఖపట్నంలోని గీతం వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన మల్లికార్జున డాక్టరేట్‌ను అందుకోవడంపై గ్రామస్తులు అభినందించారు.

సన్మానం



ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఎంఈఓ-2గా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్లిన శేషాద్రి వాసును ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం సన్మానించారు.తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఒంటేరు మల్లికార్జున, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు మధుసూదన్‌శాస్త్రి పాల్గొన్నారు.

922 బేళ్ల కొనుగోలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 922 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. దుత్తలూరు క్లస్టర్‌కు చెందిన రైతులు 948 బేళ్లు వేలానికి తీసుకురాగా, 26 బేళ్లను తిరస్కరించినట్లు చెప్పారు. కిలో పొగాకు అత్యధికంగా రూ.245, అత్యల్పంగా రూ.150, సగటున రూ.234.74 ధర పలికిందని వివరించారు. కాగా కందుకూరులోని సీటీఆర్ఐ కేంద్రంలో ఈ నెల 31 వరకు రైతులకు పొగాకు విత్తనాలను కిలో రూ.1000కు పంపిణీ చేస్తారని చెప్పారు. కమర్షియల్ నారుమడులు పోసుకునే రైతులకు ఆగస్టు 1 నుంచి కిలో రూ.1600కు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

పౌష్టికాహారం పంపిణీ

కావలి రూరల్: తుమ్మలపెంట పీహెచ్‌సీలో క్షయ రోగులకు పౌష్టికాహారం కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. వైద్యులు హిమదీప్తి, సూపర్‌వైజర్లు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీని పూర్తిచేయాలి

ఉదయగిరి: ఉదయగిరి ఉపఖజానా కార్యాలయం పరిధిలోని ఉద్యోగులు, పెన్షనర్ల ఈకేవైసీ ప్రక్రియను త్వరితగతిన నూరు శాతం పూర్తిచేయాలని జిల్లా ఖజానా కార్యాలయ డీడీ పీ గంగాద్రి అన్నారు. ఉదయగిరి ఉపఖజానా కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈకేవైసీ నమోదు తక్కువగా ఉండడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఎస్టీఓ మ మత, సీనియర్ సహాయకుడు శ్రీహరి ఉన్నారు.

ఉపాధి లక్ష్యాలను సాధించాలి

ఉదయగిరి: ఉపాధి లక్ష్యాలను నూరుశాతం సాధించేందుకు క్షేత్రసహాయకులు కృషిచేయాలని ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ గాయత్రీదేవి అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజు ఐదు వేల మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించాలని సూచించారు. కూలీలకు రూ.272 కూలి గిట్టుబాటయ్యేలా చూడాలన్నారు. ఏపీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌పై సర్వే

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలో విద్యార్థుల డ్రాపౌట్స్‌పై ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి బుధవారం సర్వే చేపట్టారు. మంచాలపల్లి లోని జంగాల కాలనీ,అనంతసాగరంలోని ఎస్టీ కాలనీలో సర్వే చేపట్టి పది మంది డ్రాపౌట్స్‌ను గుర్తించారు. వారిని పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టారు. ఉపాధ్యాయులు ఎం సుబ్బారెడ్డి, పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీని నమ్మితే భవిష్యత్ అంధకారమే



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: టీడీపీని నమ్మితే రాష్ట్ర ప్రజల భవిష్యత్ అంధకారం అవుతుందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సింగపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను గడప గడపకు చేరవేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలను ప్రతిఒక్కరూ ఎండగట్టాలన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు మేలు జరగడాన్ని ఓర్వలేక బురద జల్లుతున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు పేదలను చంద్రబాబు కనీసం పట్టించుకోలేదన్నారు. నిరంతరం ప్రజాసంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. 14 ఏళ్ల టీడీపీ ప్రభుత్వ హయాంలో చేయలేని అభివృద్ధి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసి చూపించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, ప్రసాద్ నాయుడు, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, ఉస్మాన్, మేడా శ్రీనివాసులరెడ్డి, నిమ్మల భాస్కర్, మునిరాజ్, బత్తల సుధ, చెంతాటి శ్రీను, బత్తల గోపాల్, సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



భట్టువారిపాళెంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ పంపిణీ చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: సీఎం ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. భట్టువారిపాళెం, మార్తులవారిపాళెం గ్రామాల్లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. తొలుత మేకపాటికి ఎంపీటీసీ సభ్యుడు పోలు చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మార్తులవారిపాళెంలో మార్తుల ఆదిరెడ్డి, మూలి చలమయ్య అనే దివ్యాంగ యువకులకు తన సొంత ఖర్చులతో త్రిచక్ర వాహనాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తాము ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లగలుగుతున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజల ఆదరణ చూస్తుంటే 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. జెడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ములకా శ్రీనివాసులరెడ్డి, స్థానిక నాయకులు ఓబులరెడ్డి, కృష్ణారెడ్డి, కొండారెడ్డి, అంకిరెడ్డి, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఆత్మకూరురూరల్: మురగళ్ల సచివాలయం పరిధిలోని బండారుపల్లిలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలాధికారులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

అల్లూరు: అల్లూరు, నార్త్‌మోపూరు, సింగపేటను అల్లూరు నగర పంచాయతీ నుంచి పంచాయతీలుగా మార్చే విషయంపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు కమిషనర్ ఫణికుమార్ బుధవారం తెలిపారు. కావలి డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో ఉదయం 10:30 లకు నార్త్‌మోపూరు, మధ్యాహ్నం 12 గంటలకు సింగపేట, మధ్యాహ్నం 2 గంటలకు అల్లూరులో ప్రజాసేకరణకు సభలు నిర్వహించనున్నట్లు వివరించారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు హర్షణీయం

చేజర్ల(సోమశిల): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యుత్ బిల్లులను ఇక నుంచి ప్రభుత్వమే సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ద్వారా చెల్లించనున్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించడం హర్షణీయమని చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్ సీనియర్ ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు పాఠశాల విద్యుత్ బిల్లులను హెచ్‌ఎంలు పాఠశాల నిర్వహణ గ్రాంట్ నుంచి చెల్లించేవారని తెలిపారు. మంత్రి తాజా ప్రకటనతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.

సర్పంచ్‌పై ఫిర్యాదుపై విచారణ

ఉదయగిరి: ఉదయగిరి సర్పంచ్ పాము రి సామ్రాజ్యం నిబంధనలు అతిక్రమించి పంచాయతీ కార్యాలయ ఆవరణలోని టేకు చెట్ల నరికివేయడంతో పాటు పంచాయతీ స్థలాన్ని ఇతరులకు కేటాయించినట్లు స్థానికులు ఆరాఫత్, నవాజ్ కావలి డీఎల్‌పీఓ రాధామాధవీలతకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉదయగిరి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌పై డీఎల్‌పీఓ బుధవారం విచారణ చేపట్టారు. పంచాయతీ స్థలాన్ని పరిశీలించిచ రికార్డులను తనిఖీ చేసి వివరాలు సేకరించారు. ఆమె వెంట ఈఓ నరసయ్య ఉన్నారు.

వేతనాల కోసం వినతి

పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తమకు నెలల తరబడి వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వేతనాలు ఇప్పించాలని డీఎల్‌పీఓ రాధామాధవీలతకు వినతి పత్రం అందజేశారు.

విశ్వరూప మహాసభ జయప్రదానికి పిలుపు

కలిగిరి: హైదరాబాద్‌లో ఆగస్టులో నిర్వహించనున్న విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవమాదిగ కోరారు. కలిగిరిలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో చేపట్టే చలో హైదరాబాద్, విశ్వరూప మహాసభకు లక్షలాది మంది తరలివెళ్లాలన్నారు. నాయకులు నందిపోగు వెంగళరావు, పందిటి అంబేద్కర్, గోసాల కొండలరావు, కొప్పర్తి కొండయ్య, గోచిపాతల వెంకటేశ్వర్లు, మందా సుజాత పాల్గొన్నారు.

గోరుముద్ద పరిశీలన

ఆత్మకూరురూరల్: మహిమలూరు ఉర్దూ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత ను సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచిచూశారు. ప్రధానోపాధ్యాయు డు జావేద్ మెహదిను అడిగి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకున్నారు.

ఆనకట్ట వద్ద శవాల పూడ్చివేతపై ఫిర్యాదు

ఉదయగిరి: స్థానిక ఆనకట్ట సమీపంలో జనావాసాలకు దగ్గరగా శవాల పూడ్చివేతపై తహసీల్దార్ జగదీష్‌బాబుకు బుధవారం ఫిర్యాదు చేశారు. శ్మశానం ఉన్నప్పటికీ కొందరు ఉద్దేశపూర్వకంగా ఇక్కడ శవాలను పూడ్చివేస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగా ఇళ్లలో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనకట్ట వద్ద శవాలు పూడ్చకూడదని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన ఖాతరు చేయడంలేదని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చర్యలు తీసుకోవాని తహసీల్దార్‌ను కోరారు. గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

కేజీబీవీను తనిఖీ చేసిన జీసీడీఓ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని జీసీడీఓ మమత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూం, వంటగది, తరగతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆరో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై ప్రిన్సిపల్ లక్ష్మమ్మను ఆరాతీశారు. నూరు శాతం అడ్మిషన్లు చేయడంపై అభినందించారు. కొత్తగా నియమితులైన సిబ్బందితో మాట్లాడారు. సంవత్సరం మొదటి నుంచే ఉత్తమ ఫలితాలు తీసుకురావడానికి ప్రయత్నం చేయాలని సూచించారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న జీసీడీఓ మమత

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

జలదంకి: అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ అన్నారు. మండలంలోని తిమ్మసముద్రం సచివాలయం పరిధిలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, తహసీల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో ఆర్డీఓ మాట్లాడారు. ప్రజలు సమస్యలపై ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లకుండా గ్రామస్థాయిలోనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కేశవరం సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా 11 రకాల సేవలను అందిస్తున్నారని వివరించారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఎంఈఓ శ్రీధర్, ఏఓ శైలజ, హౌసింగ్ ఏఈ ప్రసాద్, ఏపీఓ శ్యామల, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

చేజర్ల: పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య వైద్యసిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులు, వైద్యసిబ్బంది హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం వ్యాక్సిన్ రూమ్, మందుల గదిని పరిశీలించారు. నెలకు ఎన్ని కాన్పులు చేస్తున్నారు.. గర్భిణులకు రక్తహీనత తలెత్తకుండా ఇంజక్షన్లు వేస్తున్నారాని వైద్య సిబ్బందిని ఆరాతీశారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి కే హర్షిత, సీహెచ్‌ఓ చంద్రయ్య, వైద్య సిబ్బంది ఉన్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా



ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మురగళ్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. తొలుత రూ.56 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనాలను ప్రారంభించారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం మురగళ్లలో కోటి రూపాయలు కూడా ఖర్చు చేసిన దాఖలాలు లేవన్నారు. తమ ప్రభుత్వం నాలుగేళ్లలో మురగళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు రూ.18 కోట్లను ఖర్చు చేసింది వివరించారు. అందులో రూ.14 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించామన్నారు. ఇటీవల వచ్చిన నివేదికల ప్రకారం రాష్ట్రంలో 2016లో 11.77 శాతంగా ఉన్న పేదరికం, రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా 10 శాతం కంటే తగ్గి 6.05 శాతానికి చేరిందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డిని 2014 ఎన్నికల్లో మరోమారు గెలిపించుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్, మురగళ్ల సర్పంచ్ పువ్వాడి హరిత, నాయకులు పువ్వాడి శ్రీనివాసులు నాయుడు, తోడేటి అశోక్, శంకరయ్య యాదవ్, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఉపాధి ఏపీఓ శిరీషారెడ్డి, ఏఓ కిషోర్ బాబు, వెలుగు ఏపీఎం వెంకమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు నయోమి, శరత్, తదితరులు పాల్గొన్నారు.

యాసిడ్స్ విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



సోమశిల: యాసిడ్ బాటిల్‌ను పరిశీస్తున్న ఎస్సై భోజ్యానాయక్



మర్రిపాడు: యాసిడ్ బాటిల్‌ను పరిశీలిస్తున్న ఎస్సై విశ్వనాథరెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): యాసిడ్స్ విక్రయదారులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మర్రిపాడు ఎస్సై పీ విశ్వనాథరెడ్డి సూచించారు. మర్రిపాడులోని దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న యాసిడ్ దాడుల కట్టడికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యాసిడ్స్ విక్రయాలపై తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. యాసిడ్ దాడులకు పాల్పడే వారిపైనే కాకుండా విక్రయించిన వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై దుకాణదారులు పోలీసుల అనుమతి లేకుండా యాసిడ్స్ విక్రయిస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు.

చేజర్ల(సోమశిల):అనంతసాగరం మండలం సోమ శిల, ఉప్పలపాడు, పీకేపాడు, చిలకలమర్రిలోని దుకాణాల్లో యాసిడ్స్ విక్రయాలపై సోమశిల ఎస్సై భోజ్యానాయక్ తనిఖీలు చేపట్టారు. యాసిడ్స్ విక్రయదారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. నిబంధనలు అతిక్రయించి యాసిడ్స్ వ్యాపారాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుకాణాల్లో తనిఖీలు

ఉదయగిరి: పట్టణంతో పాటు మండలంలోని యాసిడ్స్ విక్రయ దుకాణాలను ఎస్సై ఇంద్రసేనారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. జిల్లా అధికారుల సూచనల మేరకు తనిఖీలు చేపట్టినట్లు ఆయన చెప్పారు. గాఢత ఎక్కువ కలిగిన యాసిడ్స్ విక్రయించాలంటే తప్పనిసరిగా దుకాణాదారులు లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. యాసిడ్స్ విక్రయ దుకాణదారుల వివరాలు సేకరించి పై అధికారులకు పంపామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హౌస్‌హోల్డ్ సర్వేను బాధ్యతగా చేపట్టాలి

ఆత్మకూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు గురువారం నుంచి నెలరోజుల పాటు హౌస్‌హోల్డ్ సర్వేను బాధ్యతగా చేపట్టాలని ఆర్డీఓ సాధు కరుణకుమారి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని తహసీల్దార్లు, బీఎల్‌ఓలతో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఎల్వోలు బాధ్యతగా ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితాలను పక్కాగా రూపొందించాలని ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుభద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ కరుణకుమారి

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

వింజమూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు హెచ్‌ఎం మాలకొండయ్య బుధవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. గతంలో కలిగిరి సీఐగా పని చేసిన సాంబశివరావు పదోతరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.50వేలు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని ప్రకటించారు. ఈ మేరకు గత విద్యాసంవత్సరంలో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన తులసీరెడ్డి, గుణసాత్విక్‌రెడ్డితో పాటు మరో విద్యార్థికి కలిపి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. తొలుత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు



నగదు బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం మాలకొండయ్య

మున్సిపల్ కార్మికుల నూతన కమిటీ ఎన్నిక

ఆత్మకూరు: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సీఐటీయూ జనరల్ బాడీ సమావేశంలో ఆత్మకూరు కమిటీ గౌరవాధ్యక్షుడిగా కే డేవిడ్‌రాజు, అధ్యక్షుడిగా జీ రూబిన్, కార్యదర్శిగా జీ నాగేంద్ర, కోశాధికారి వీ గురవయ్య, ఉపాధ్యక్షుడుగా ఎస్ భాస్కర్, సహాయ కార్యదర్శి సయ్యద్ రిజ్వాన్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే పెంచలనరసయ్య ప్రత్యేక అతిథిగా హాజరై కార్మిలకుల సమస్యలపై మాట్లాడారు. జిల్లా కౌలు రైతు సంఘం నాయకుడు జీ లక్ష్మీపతి, సీఐటీయూ జిల్లా నాయకులు జీ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

కావలి రూరల్: కావలి డివిజన్ పరిధిలోని రైతులు ఖరీఫ్ పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని కావలి ఏడీఏ సీహెచ్ నాగరాజు సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కావలి డివిజన్ పరిధిలో ఖరీఫ్‌లో వరి, వేరుశనగ, పత్తి పంటలను దాదాపు 10వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారని తెలిపారు. కౌలు రైతులు, రైతులు తమ పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకుంటనే ఉచిత పంటల బీమాతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు అందుతాయని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు ఈ-క్రాప్‌పై అవగాహన కల్పించి నమోదు చేసుకునేలా చూడాలని కోరారు. డివిజన్ పరిధిలో సుమారు 6400 కౌలురైతు కార్డులు నమోదు చేశామని తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హులైన కౌలు రైతులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.